నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

కోడికూర తినలేం.. యాట కూర కొనలేం

రూ.1000 పలుకుతున్న మటన్

నవతెలంగాణ-రామారెడ్డి



కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతుండటంతో ముందస్తు జాగ్రత్తగా ప్రజలు చికెన్, కోడిగుడ్లకు దూరంగా ఉండాలని ప్రభుత్వం సూచించిన విషయం విధితమే. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు చికెన్ , గుడ్లు తినలేక, పెరిగిన మటన్ రేట్ తో కొనుగోలు శక్తి లేక ప్రజలు చికెన్, మటన్ కు దూరంగా ఉంటున్నారు. చికెన్ అమ్మకాలు 80 శాతం పడిపోవడంతో దుకాణాల్లో గిరాకి లేక దుకాణదారులు విలవిల్లాడుతున్నారు. పెండ్లీల సీజన్ కావడంతో గొర్లకు, మేకలకు డిమాండ్ పెరగడంతో మార్కెట్లో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. కిలో మటన్ రూ.800 నుంచి 1000 పలుకుతుండటం గమనార్హం. దీంతో ముక్కలేకుండానే ముద్ద తినాల్సి వస్తుంది. సామాన్య ప్రజలకు చికెన్ తినలేక, మటన్ కొనలేక నాన్ వెజ్ కు దూరంగా ఉంటున్నారు.

వాటర్ లీకేజ్ ఉంటే వెంటనే పరిష్కరించాలి

మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ డి.ఈ వెంకటేశ్వర్

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)



మండలంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ డి. ఈ వెంకటేశ్వర్ శుక్రవారం మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ వాడకం పరిశీలించారు. వాటర్ పైప్ లైన్ లీకేజీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ పంప్ హౌస్ ల వద్ద సూపర్వైజర్లు పరిశీలిస్తూ నీటిని పొదుపుగా వాడే విధంగా చర్యలు తీసుకోవాలని, గృహాలకు భగీరథ నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ ఏ.ఈ సత్యనారాయణ, మిషన్ భగీరథ ఏ.ఈ రజిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

కమ్యూనిస్టులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

- అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి : సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కమ్యూనిస్టులపై కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ రాష్ట్ర విస్తృత సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు తొత్తులుగా మారారని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల పైన కెసిఆర్ ఒక్క మాట మాట్లాడకుండా బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినప్పటికీ ఎటువంటి నిరసన తెలియ జేయకుండా ఎవరు ఎవరికి తోత్తులుగా మారారు ఆలోచించాలని హితవు పలికారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా కమ్యూనిస్టుల సహకారంతోటే గెలిచామని చెప్పుకున్న కేసీఆర్ ఇప్పుడు కమ్యూనిస్టులను విమర్శించటం ఆకాశం మీద ఉమ్మి వేయటమే అవుతుందని అన్నారు. నిత్యం మతోన్మాదానికి వ్యతిరేకంగా.. ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాల పైన పోరాటాలను చేసే కమ్యూనిస్టులను విమర్శించటం కెసిఆర్ అనాలోచితానికి నిదర్శనం అని తెలిపారు. ఇప్పటికైనా కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ తన వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీకి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జె .శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసన యాత్ర

నవతెలంగాణ-ఆర్మూర్/నవీపేట్/కంఠేశ్వర్




నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రైతులతో మాట్లాడుతున్న నాయకులు.. మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్

కేంద్ర ప్రభుత్వం 2024 నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విదానం (ఎన్పీఎఫ్ఎం) ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ నుంచి శుక్రవారం రైతుల నిరసన యాత్ర చేపట్టారు. ఆర్మూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రారంభమైన రైతుల నిరసన యాత్ర ఆలూరు, నందిపేట్, నవీపేట్, జానకంపేట్ మీదుగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ శ్రద్ధానంద్ గంజ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉందని, ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందిం చిందని అన్నారు. దేశ రైతాంగం ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయి దాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నవీపేట్‌లో పాటపాడుతున్న ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయి దాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించు కోవాలని, దీని స్థానంలో రైతులు, వినియోగదా రుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా సి2 పైన 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న, ఎర్ర సాయిలు, ఇడగొట్టి సాయిలు, గంగారాం, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్లు మృత్యువాత

- మూడు రోజుల నుంచి 50 నాటు కోళ్లు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్



మండలంలోని మల్లూరు గ్రామంలో గత మూడు రోజుల నుండి సుమారు 50 నాటు కోళ్లు ఉన్నట్టుండి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇంకా కొన్ని నాటు కోళ్లు సైతం అనారోగ్యంతో ఉన్నాయని సమాచారం. నాటు కోళ్లు మృతి చెందడం పై స్థానికులు నాటు కోళ్లకు బర్డ్ ఫ్లు వైరస్, ఇంకా ఏదైనా వైరస్ సోకిందేమో అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెటర్నరీ అధికారులు తక్షణమే స్పందించి మరణించిన కోళ్ల శాంపుల్స్ సేకరించి ఏ కారణం చేత మరణించాయో అధికారులు ధ్రువీకరించాలని కోరుతున్నారు. కోళ్ల మృత్యువాత పడుతుండటంతో తీవ్ర నష్ట వాటిల్లుతుందని పెంపకందారులు వాపోతున్నారు.

ఈ ఘటన పట్ల వెటర్నరీ డాక్టర్ శృతి లయను వివరణ కోరగా ..

అనారోగ్యంతో ఉన్న నాటు కోళ్లను పరిశీలించగా నాడి లక్షణాలు, జీర్ణ రుగ్మతలు ఆకుపచ్చని, తెల్లటి విరేచనాలు వంటి లక్షణాలు గమనించినట్టు తెలిపారు. వీటి ఆధారంగా ఈ వ్యాధిని రనికేట్ వ్యాధిగా అనుమానం వ్యక్తం చేశారు. మరింత నిర్ధారణ కోసం ఏ డి డి ఎల్ నిజామాబాద్ వారు పరీక్ష చేయాలని అన్నారు. చనిపోయిన కోళ్లను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని వాటిని గోతి తీసి పూడ్చి పెట్టాలని దాని ద్వారా ఇంకో జంతువుకు ఆ వ్యాధి సోకకుండా ఉంటుందని తెలిపారు. నాటు కోళ్లు బర్డ్ ఫ్లు లక్షణాలు లేవని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న కోళ్లకు మెడిసిన్ అందించామని వెల్లడించారు.

ఎంఎంపీటీఎఫ్ అమలుకు సహాయ సహకారాలు అందిస్తాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్

వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్ట్నర్ ఫండ్ (ఎం.ఎం.పీ.టీ.ఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్దేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయడానికి గల కారణాలు, ఎంఎంపీటీఎఫ్‌ను అమలు చేయాల్సిన విధానం, యూఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందించే తోడ్పాటు తదితర అంశాల గురించి వివరించారు. పైలెట్ ప్రాజెక్టును జిల్లాలో సమర్ధవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారీ, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఏ.డీ.ఏ ప్రదీప్ కుమార్, సిరికొండ, ధర్పల్లి ఏ.ఓలు నర్సయ్య, వెంకటేష్, యూఎన్ఓ ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సీ జోసెఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్ ఉప్పలపాటి, వాసిల్ పాల్గొన్నారు.

నామమాత్రపు బోర్డుతో ఒరిగిందేమీ లేదు

- నిజామాబాద్‌లో పసుపు ధర పది వేలు సాంగ్లిలో 13 వేలు
- మద్దతు ధర వచ్చే వరకు పల్లెగంగారెడ్డి, ఎంపీ అరవింద్ నిజామాబాద్‌కు రావొద్దు : వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు పంటకు నిజామాబాద్ మార్కెట్ లో ధర పది వేలు ఉంటే సాంగ్లి మార్కెట్ లో 13 వేలు ఉందని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిజెపి ఎంఎస్పి లేని పసుపు బోర్డు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు మూడు నాలుగు రోజులు పసుపు కుప్పలమీద పడుకునే పరిస్థితి ఏర్పడుతుందని, పసుపు బోర్డు కార్యాలయం డిల్లీలో, చైర్మన్ అంకాపూర్ లో ఎంపీ అరవింద్ హైదరాబాద్‌లో ఉంటే రైతులకు ఇలాంటి తిప్పలు తప్పవని అన్నారు. నిజామాబాద్ మార్కెట్ గంజ్ చాలా పెద్దదని, నిర్మల్, జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్, బాల్కొండ. రూరల్ నియోజక వర్గాల రైతులు పసుపు క్రయ విక్రయాలు ఇక్కడే జరుపుతారన్నారు. మార్కెట్ లో ఒకటి రెండు కుప్పలకు పదివేలు, పదివేల ఒక్క రూపాయి, రెండు అని చెప్పి మిగితా వారి పసుపు ను తక్కువకు కొంటున్నారన్నారు. ఇనాం లో 10 వేలకు తక్కువ ఇవ్వొద్దని చెప్పిన దళారులు పక్క దారుల్లో 8500 కొంటున్నారన్నారు. కటాప్ రేట్ తగ్గించే ఆలోచనలో అన్నట్లు మాకు సమాచారం ఉందన్నారు. గంజ్ లో ఉన్న ప్రతి కుప్ప ఈ వేలం లో కొనల్సిందే అన్నారు. పసుపు బోర్డు లేనపుడు క్వింటాల్ కు 16000, 23000 ఉండేనని, ఇప్పుడు పది వెలు మాత్రమే ఉందన్నారు. మద్దతు ధర లేని పసుపు బోర్డు గుండు సున్నా తో సమానమన్నారు. పసుపునకు మద్దతు ధర వచ్చే వరకు గంగారెడ్డి, ఎంపీ అరవింద్ నిజామాబాద్ రావొద్దని డిమాండ్ చేశారు.

కూతురు పెళ్లిలో గుండెపోటుతో తండ్రి మృతి

- కాళ్లు కడుగుతుండగానే కుప్పకూలిన తండ్రి

నవతెలంగాణ-భిక్కనూర్



కూతురు కాళ్లు కడుతున్న బాల్‌చంద్రం

అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కూతురు పెళ్లి సంతోషంగా జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా తండ్రి కుప్పకూలి హఠాత్ మరణం పెళ్లి వేడుకలో, గ్రామంలో విషాదం నింపింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన బాల్‌చంద్రం (56) గత కొంతకాలంగా కామారెడ్డి లో నివసిస్తున్నారు. శుక్రవారం మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్నా ఇంద్రప్రస్థాన్‌లో తన కూతురు వివాహం జరుగుతున్న సమయంలో పెళ్ళికొడుకు కాళ్లు కడుగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి తండ్రి కింద పడిపోయారు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన కామారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అప్పటి వరకు ముందుండి పెండ్లి తంతు నిర్వహిస్తూ పలకరింపులతో హడావుడిగా గడిపిన తండ్రి.. గుండెపోటుతో మృతిచెందడంతో తీవ్ర విషాదం నింపింది.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు, శ్రమజీవులకు చోటెక్కడ..?

- బడ్జెట్‌లో సమూల మార్పులు చేసి ప్రజా, కార్మిక సంక్షేమానికి నిధులు కేటాయించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన రూ.50.65 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో పేదలకు, కార్మిక వర్గానికి ఎలాంటి కేటాయింపులు చేయలేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ల కు దోచిపెట్టే బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలడుగు సుధాకర్ హాజరై సెమినార్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. మధ్యతరగతి ఉద్యోగులను మాయ చేస్తూ తమ ఆదాయంలో పన్ను రాయితీని ప్రకటిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లుగా 12 లక్షలకు ఒక్కరూపాయి పెరిగినా నాలుగు లక్షల పన్నును విధించనుందని, ఇది దుర్మార్గం అని మండిపడ్డారు. మరోవైపు ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం స్వాగతిస్తూ ప్రకటన చేయటం దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసి, జిఐసి, పోస్టల్ బీమా లాంటి సంస్థలను నీరుగారిస్తూ ప్రైవేటు వ్యక్తుల పరం చేసిందన్నారు. విద్యుత్తును ప్రైవేటీకరిస్తూ భారతదేశ్యానికి తలమానికంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పెద్ద ఎత్తున దెబ్బకొట్టేందుకు ప్రయత్నాలు చేసిందనీ, సంవత్సరాల తరబడి రైతాంగం వ్యవసాయ దారులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర బడ్జెట్లో పంటల గిట్టుబాటుకు సంబంధించిన ప్రకటన చేయకపోవడం తీవ్ర వ్యతిరేకతను కేంద్ర బిజెపి ప్రభుత్వం కూడగట్టుకుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనికి బడ్జెట్ పెంచాలని పని రోజులు పెంచాలని కోరుతున్నప్పటికీ ఏటేటా బడ్జెట్ చెల్లింపులలో తగ్గిస్తూ రావడం ఈ పథకాన్ని నీరుగార్చడం తప్ప మరొకటి కాదన్నారు.

'ప్రస్తుతం మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు దేశంలో 19 మంది గా ఉన్న సంపన్నులు నేడు 200 మందికి పెరగడం ఎంతటి కార్పొరేట్ బడా సంస్థలకు కేంద్రం కొమ్ముకాస్తుందో అర్థం చేసుకోవచ్చు. దేశంలో బడా కార్పొరేట్ సంస్థల ఆదాయంలో నాలుగు శాతం పన్ను గనుక విధిస్తే దేశ జాతీయ స్థూల ఆదాయం మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నప్పటికీ కార్పొరేట్ల ఆదాయం పై పన్ను విధించేందుకు బిజెపి ప్రభుత్వం ధైర్యం చేస్తున్న పరిస్థితి లేదు. ముఖ్యంగా నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్రం నుండి ఎనిమిది మందిని ఎంపీలుగా ఎన్నికై.. కేంద్ర మంత్రులుగా ఇద్దరు కొనసాగుతున్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం తమ బడ్జెట్లో ఎలాంటి ప్రకటన ప్రకటించిన పరిస్థితి లేదు. కాబట్టి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తక్షణమే సమూల మార్పులు చేయాలని ముఖ్యంగా కార్మిక వర్గంపై కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నాలను మానుకోవాలని, ఎనిమిది గంటల పని దినాలను 12 గంటలకు మారుస్తూ చేసే విధానాలను తక్షణమే వెనుక్కు తీసుకోవాలని లేబర్ కోర్టులో అమలుకు సిద్ధమవుతున్న బిజెపి ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోళ్లను వెనుక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్ నాయక్, సిఐటియు జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహబూబ్, ఉపాధ్యక్షుడు కాత్రియాల ప్రభు, గ్రామపంచాయతీ బాల్ నర్సు, మిషన్ భగీరథ అధ్యక్షుడు అనిల్, ప్రతినిధులు విజయ్, నర్సింలు, భూలక్ష్మి, నర్సింలు, సాయిలు, పురుషోత్తం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హజరైన కార్యకర్తలు, నాయకులు

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు

డీఎంఅండ్‌హెచ్‌వో పద్మశ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్తపూర్వ గర్భస్థ పిండా లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశము డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ అధ్యక్షతన డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఏ స్కానింగ్ కేంద్రంలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మెడికల్ షాపుల్లో అబార్షన్ కొరకు వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే అమ్మ రాదని స్పష్టంచేశారు.ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ ద్వితీ, పిల్లల వైద్యులు డాక్టర్ పి ప్రసన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ బి బిందు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధా తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల నిర్వహణ మూన్నాళ్ల ముచ్చటే

- పైకప్పు జరగడంతో రైతు వేదికలోకి ఎండ, వాన

నవతెలంగాణ-సదాశివనగర్



ఆర్భాటంగా నిర్మించిన రైతు వేదికలకు నిర్వహణ కొరవడింది. దీంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సదాశివనగర్ మండలంలో ఆరు రైతు వేదికలు నిర్మించారు. అందులోని పద్మాజివాడి రైతు వేదిక రూ.22 లక్షలతో నిర్మించినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. మున్నాళ్లకే రైతు వేదిక పైకప్పు లేచిపోవడంతో ఎండ, వర్షం నేరుగా రైతు వేదిక లోపల పడుతోంది. ఈ పద్మాజివాడి రైతు వేదికలో 3074 మంది రైతు వేదికలో సభ్యులుగా ఉన్నారు. రైతు వేదిక నిర్మాణంలో మౌలిక వసతులు కూడా నిర్మించకుండానే వదిలేసినట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్నాళ్లకే రైతు వేదికలో రైతువేదిగాకు ఇరుపక్కల ఏర్పాటుచేసిన నాపరాలు ఇప్పుడే ఊడిపోయాయి. మారుగు దోడ్ల నుండి ఏర్పాటు చేసిన పైపులైను సెప్టిక్ ట్యాంక్‌లోకి ఏర్పాటు చేయకనే మధ్యలోనే వదిలి వేయడం వల్ల ఆ మురుగు నీరు పరిసరాల్లోనే నిలుస్తుంది.



పైకప్పుపై ఏర్పడ్డ గ్యాప్

ఆ రైతు వేదికను నిర్మించిన కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ రైతు వేదికలో మోడేగాం, కలవరాలు, దగ్గి, పద్మాజివాడి, తుక్కో జివాడి, తిమ్మోజివాడి రైతు వేదికకు వస్తుంటారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధించిన ఏఈఓ శ్రీలక్ష్మి వద్దకు వచ్చి రైతులు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ప్రభుత్వం ఒక్కొక్క రైతు వేదిక నిర్వహణకు 5 వేలు ప్రతి నెలా కేటాయిస్తుంది. కానీ కాంట్రాక్టర్లు నాసిరకం మెటీరియల్ తో రైతువేదికను నిర్మించినట్టు రైతులు తెలిపారు. వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తూతూ మంత్రంగా నిర్మించి బిల్లులు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పైన ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల పైన కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

నవతెలంగాణ-పొతంగల్(కోటగిరి)

మండలంలోని ఎత్తొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని, రెడ్‌క్రాస్ సౌజన్యంతో, ఛత్రపతి శివాజీ నవసేన యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈ సంవత్సరం కూడ, శిబిరం ఏర్పాటు చేశారని యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో హన్మంతు, శ్యామ్, జగన్, శివ శంకర్, కార్తీక్, శివరాం, సాయికుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు హన్మంతరావు, బర్ల రవి, వెంకటేశం, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముసుకు బొర్రన్నకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన ముస్కు బొర్రన్న పెద్ద కర్మ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి అన్న, మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయిరెడ్డి తండ్రి ముస్కు బొర్రన్న ఇటీవల మరణించడంతో శుక్రవారం పెద్దకర్మ నిర్వహించగా.. ఎమ్మెల్యే భూపతి రెడ్డి హాజరై బొర్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, నిజామాబాద్ రూరల్ యువజన విభాగం ఉపాధ్యక్షుడు వినోద్, జిల్లా నాయకులు, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలోచన చేసి ఓటు వేయండి

- ఏఎంసీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఏఎంసీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఒక ఏడాదిలో పలు రకాల ఉద్యోగలాకు నోటిఫికేషన్ వేసిందని తెలిపారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. ఈ ప్రచారంలో ప్యాక్స్ చైర్మన్ నామాల సాయిబాబా, మాజీ ప్యాక్స్ చైర్మన్ నెమని వీర్రాజ్, రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు భారీ, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నెమని రఘు, మాజీ కోఆప్షన్ కరీం, సరిచంద్, మాజీ ఉపసర్పంచ్ కంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతి గృహం అకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసిల్దార్ శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని తహసిల్దార్ శ్రావణ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు, కూరగాయలు వంట సామగ్రిని శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ రాధా రాణికి ఆదేశించారు. బాత్రూములు, మరుగుదొడ్ల తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆమె ఆయనకు తెలపడంతో మరమ్మతులు చేయించడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు, సమయానుకూలంగా వారికి భోజనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒంటరిని శుభ్రంగా ఉంచుతూ కూరగాయలను భద్రపరచాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది గౌతం తదితరులున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

- నిర్వాహకులతో పాటు ఇద్దరు మహిళలు అరెస్టు



పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీప్రియనగర్‌లోని వ్యభిచార గృహంపై రైడ్ చేసి 1 నిర్వాహకురాలిని, ఇద్దరు బాధిత మహిళలను, 2విటులను అదుపులోకి తీసుకున్నారు. రూ.670 నగదు, 5 సెల్‌ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పినట్లు తెలిపారు.

సరైన వాహన పత్రాలు లేని వాహనదారులపై చట్టపరంగా చర్యలు

- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు

సరైన వాహన పత్రాలు లేని వాహనదా రులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని వన్నెల్.బి కూడలి వద్ద శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు బాధ్యతగా సరైన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్, నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని సూచించారు. ఈ తనిఖీలలో అడిషనల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్ రెడ్డి, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

- నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ విద్యార్థులకు సూచించారు. గురువారం నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాల విద్యార్థులకై రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఎస్ఎస్ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేసినట్లు ఇంచార్జ్ అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సరైన అవగాహన పెంచుకుని తమను తాము రక్షిస్తూ ఇతరులను కూడా హాని కలుగజేయకుండా ఉండటమే నియమావలిలో ఒక భాగమని అన్నారు. ప్రతీ వాహనదారుడు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ ఆచితూచీ పాటిం చాలని తెలిపారు. సీటు బెల్ట్, హెల్మెట్ సరైన మార్గంలో పయ నం వంటి వాటిని కచ్చితంగా నేర్చు కుని ముందుకు సాగాలని అన్నారు. రోడ్డు భద్ర త నియమా లు వాహనదారులకు ఉత్తమ మైన సాధనా లని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు ప్రముఖ దంతా వైద్య నిపుణులు డాక్టర్ కొండ అమర్‌నాథ్ పిపిటి ప్రజెంటేషన్ ద్వారా వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి చక్కటి ఉదాహరణలు ఇస్తూ విద్యార్థులకు రోడ్డు భద్రతపై సూచనలను చేశారు. ప్రతి నిమిషం ప్రపంచవ్యాప్తంగా చాలా యాక్సిడెంట్లు అవుతున్నాయని అందులో భారత దేశంలో నిమిషానికి ముగ్గురు చనిపోతున్నారని సూచించారు. ఇంతే కాకుండా పోలీస్ కళాబృందం శ్రీనివాస్, విక్రమ్, రమేష్, సీత ఆధ్వర్యంలో సందేశాత్మకమైన స్కిట్ అలాగే పాటలు పాడి విద్యార్థులకు చక్కటి అవగాహనను కల్పించారు. తదనంతరం విద్యార్థులచే రోడ్డు భద్రత నియమాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కార్యక్రమ కార్యానిర్వాహణ అధికారి డాక్టర్ మారయ్యగౌడ్, సభ్యులు గోపాల్ సోని, ఆకుల అశోక్, రాజ్ కుమార్ సుబేదార్ తదితరులతో పాటు కళాశాల సిబ్బంది ఇన్చార్జి శ్యాం, భూమయ్య, స్వప్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ

గిరిజన సంక్షేమ కళాశాలలో

న్యాక్ బృందం పర్యటన

- గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా పరిశీలనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన ముగిసింది. బుధ, గురువారాల్లో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కమిటీ కళాశాలలో పరిశీలన చేశారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, పరిశీలన బృందం చైర్మన్ దేపూరి భారతి, మెంబర్ కన్వీనర్ మొహమ్మద్ ఖాలిద్, మెంబర్ గురునాథ్ వైద్య రెండు రోజుల పాటు అకాడమిక్, నాన్ అకాడమిక్ అంశాలు, విద్యార్థుల ప్రగతి, వసతుల కల్పనపై ఆరా తీశారు. బుధవారం రాత్రి వరకు బృందం సభ్యులు వారి షెడ్యూల్ ప్రకారం పరిశీలన నిర్వహించారు.



గంజాయి కేసులో నిజామాబాద్ వాసుల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గంజాయి సేవిస్తూ నిజామాబాద్‌కు చెందిన నలుగురు హైదరాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఆర్‌సీ రెసిడెన్సీ భవనంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే డ్రగ్స్ కేసులో ఒకసారి పట్టుబడిన హైదరాబాద్‌కు చెందిన ప్రియాంకరెడ్డితో నిజామాబాద్‌కు చెందిన ఎ.వెంకటేశ్, పి.విజయారెడ్డి, ఎం.రాహుల్, ఎస్.శివకుమార్ గంజాయి సేవిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరికి మత్తుపదార్థాలు ఎవరు విక్రయించారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష

- 8 మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష పడిందని, 8మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ ముందర హాజరుపరచగా 11 మందికి రూ.15000 జరిమానా విధించారు. పులాంగ్ ప్రాంతానికి చెందిన అర్.మురళీ, గోవూర్‌కు చెందిన డి.వెంకట్రాంరెడ్డి, దేశెట్టి సుధాకర్ అనే వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

విశ్రాంత ఉద్యోగులతో భేటీ అయిన మహబూబాబాద్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మహబూబాబాద్ ఎమ్మెల్యే డా భూక్యామురళి నాయక్ పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగులలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ బిల్లులు విడుదల చేయిస్తామని విశ్రాంత ఉద్యోగులకు హామీనిచ్చారు. ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీలో నరేందర్ గొంతుకగా వినిపించాలని, త్రీ వన్ సెవెన్ జీరో సంబంధించి ప్రధానంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలు తెలియజేస్తూ 317 జీవో వల్ల ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు పరిష్కారం దిశగా ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పరిష్కార దిశగా పని చేస్తామని హామీనిచ్చారని అన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు నెల మొదటి తేదీన జీతాలు వారి ఖాతాల్లో జమ చేయడానికి గుర్తు చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గం ఇంచార్జి వినయ్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఓటు హక్కు కలిగిన పట్టభద్రులను కలుస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకెట శ్రీనివాస్, పూజారి శేఖర్, వేములవాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బేస్‌బాల్ సబ్ జూనియర్ బాలికల ప్రబబుల్స్ జట్టు ఎంపిక



జిల్లా బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా బేస్ బాల్ బాలికల ప్రబబుల్స్ జట్టు 25 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. ఈనెల 23 నుంచి 27 వరకు ప్రబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేసి ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు గజ్వేల్‌లో కేజీ టు పీజీ గ్రౌండ్‌లో జరగబోయే రాష్ట్ర సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ నలిని విచ్చేసి ఎంపికను ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. శిక్షణ శిబిరంలో మెలకువలు నేర్పించుకుని తుదిజట్టుకు ఎంపికై రాష్ట్ర పోటీలలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపి జిల్లా నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓ.జోష్న, వ్యాయామ ఉపాధ్యాయులు బి.వీణ, శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వి.మౌనిక పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఏకశక్రేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పండగ కార్యక్రమాలను, జాతరను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ హరికాంత్ చారీ, ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు మాట్లాడుతూ శివరాత్రి పండుగ సందర్భంగా ఏకచక్రేశ్వర శివాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు భూమేష్, కవిత సంజీవ్, సింగం లక్ష్మణ్, ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ మహరాజ్, విడిసి చైర్మన్ గంగాధర్‌రావు పట్వారి, మాజీ కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి, మాజీ కౌన్సిల్ సభ్యులు ఆంకు దామోదర్ రెడ్డి, పిట్ల సత్యం పాల్గొన్నారు.

సాధన స్వచ్ఛంద సంస్థ పోస్టర్లను ఆవిష్కరించిన సీఐ



స్వచ్ఛంద సంస్థ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ

నవతెలంగాణ-బోధన్

సాధన స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సమాజహిత కార్యక్రమాల ప్రచార పోస్టర్లను శుక్రవారం బోధన్ పోలీసు స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ ఆవిష్కరించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా బోధన్ మండలంలో సి.యస్.ఎం. సాయిచరణ్ మాట్లాడుతూ.. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించడానికి, అలాగే బాల్య వివాహల నిర్మూలన, బాలకార్మికులను అరికట్టడం, బాలల అక్రమ రవాణా అరికట్టడానికి ఈ సంస్థ పనిచేస్తుందని అన్నారు. బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దడమే సంస్థ లక్ష్యమని అన్నారు. బాలకార్మికులను బడిలో చేర్పించడం, తద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బాలికలపై లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, వారికి అండగా నిలిచి సహకరించడం, బాల్య వివాహాలను అరికట్టి బాల్య వివాహరహిత జిల్లాలుగా కామారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్‌ను తీర్చిదిద్దడం సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం సాలూరా, కుమ్మన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ప్రజ్ఞ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల వెరిఫికేషన్



వెరిఫికేషన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రజ్ఞ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల వెరిఫికేషన్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అంతర్గత మార్కులను పరిశీలించి తగు సూచనలు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నాగభూషణం, కరస్పాండెంట్ సిహెచ్.జ్యోతి, పరిశీలకులు లక్ష్మణ్, రాజ్‌కుమార్, భాజన్న తదితరులు సబ్జెక్టుల వారీగా వెరిఫికేషన్ పూర్తి చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పైప్ లైన్ లీకేజీ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలోని ఊర చెరువు దగ్గర ఉన్నటువంటి గ్రామపంచాయతీ త్రీ ఫేస్ బోర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంద. బోర్ నుండి వాటర్ ట్యాంక్ లోకి వెళ్లే పైప్ లైన్ గత నెల రోజుల నుండి లీకేజ్ అవుతుందని సగం నీరు వృథాగా చెరువులోకే పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే వేసవికాలం వస్తున్న నేపథ్యంలో అధికారులు స్పందించి వెంటనే పైప్ లైన్ లీకేజ్‌ని బాగు చేయించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీరు

ఉపాధి పనులు పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను మండల అభివృద్ధి అధికారి నరేష్ పరిశీలించారు. మండలంలోని మంబోజి పేట గ్రామ సమీపంలో జరుగుతున్నటువంటి భూముల అభివృద్ధి పనులను పరిశీలించారు. రోజువారి కూలీల మస్టర్‌లను పరిశీలించారు. అనంతరం కొండాపూర్ గ్రామ సమీపంలో చెరువులో పూడికత పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీ ఓ మలహరి, క్షేత్ర సహాయకులు సాయ గౌడ్, ఉపాధి కూలీలు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మండల అభివృద్ధి అధికారి

మూడు నెలలు ట్రైనింగ్ ఇచ్చి పీఎంపీలకు ఏం సర్టిఫికేట్ ఇస్తారు..?

- పరిధి మించి ఇంజక్షన్‌లు, సెలైన్‌లు, గర్భస్రావం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు నాయకులు ఎందుకు సపోర్ట్ చేస్తున్నారు..? : ఐఎంఏ

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్ఎంపీ, పిఎంపిలకు శిక్షణ ఇచ్చేలా చూస్తామని చెప్పడం సరికాదనీ, వాళ్లకు 3 నెలల్లో శిక్షణ ఇచ్చి ఎలాంటి సర్టిఫికెట్ ఇస్తారని ఇండియన్ మెడకల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డా. అరవింద్, సభ్యులు డా. పుట్ట మల్లికార్జున్, డా. రమేష్ బాబు, డా. చంద్రశేఖర్, డా. ఉమారెడ్డి, డా. నవీన్, డా.జమాల్, డా.రమేష్ కొటాయ్, డా. రవికిరణ్, డా. గీరెడ్డి రవీందర్ రెడ్డి మాట్లాడారు. ఏడెనిమిది సంవత్సరాల పాటు చదువుకుని శిక్షణ పొంది వైద్యులుగా తాము కొనసాగుతున్నామని అన్నారు. ఎన్ఎంసి 34 యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నాకే ప్రాక్టీస్ చేసుకోవాల్సి ఉంటుందని, ఎన్ ఎం సి 54 యాక్టు ప్రకారం తనిఖీలు చేసి చట్ట విరుద్ధంగా ఉంటే అరెస్ట్ చేయాల్సి ఉంటు ందని తెలిపారు. కానీ ఎలాంటి శిక్షణ లేకుండా రిజిస్ట్రేషన్ లేకుండా గ్రామాల్లో వైద్య లుగా కొనసాగుతామంటే నాయకులు వారికి ఎలా సపోర్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తాయిని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు ఆర్ఎంపీ, పిఎంపిల వైపు మాట్లాడటం సరికాదన్నారు.

వైద్యులంటే మీకు ఎందుకు వివక్ష? తాము తెలంగాణ బిడ్డలం కాదా.. ఆర్ఎంపీ అనే పదం వాడటానికి వీల్లేదు. వీళ్ళు ఎక్కడ రిజిస్టర్ చేసుకున్నారు. పిఎంపి అయినా వారికి ఉన్న గుర్తింపు ఏదైనా ఉందా. గ్రామాల్లో వారికి ఫస్ట్ ఎయిడ్ చేయడానికి మాత్రమే అవకాశం ఉంది. అంతకుమించి చేయడానికి లేదు. కానీ గ్రామాల్లో ఇంజక్షన్ ఇస్తున్నారు. స్టెరాయిడ్స్, యాంటిబెటిక్ మందులు ఇస్తున్నారు. ఇల్లీగల్ అబార్షన్లు కూడా చేస్తున్నారు. ఇలాంటి వాటిని నాయకులు సమర్థిస్తారా..? గ్రామీణ వైద్యులైన తమపై దాడులు చేస్తున్నారనే సాకుతో ఆర్ఎంపీ, పిఎంపిలు ప్రభుత్వానికి గుర్తింపు ఇవ్వాలనడం సరికాదు. కొందరు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. ఆర్ఎంపీ, పిఎంపిలపై మాకు ఎలాంటి ద్వేషం లేదు. శిక్షణ ఇవ్వాలంటే ఇస్తాం, మేము చెప్పిన విధంగా వాళ్ళు ఉంటారా' అని ప్రశ్నించారు. ఆర్ఎంపీ, పిఎంపిలను రాజకీయాల కోసం పావులుగా వాడుకుంటున్నారనీ ఆర్ఎంపీ, పీఎంపీలు గుర్తించాలన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

కుప్పలు వేశారు.. పూడ్చడం మరిచారు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం వద్ద గుంతలు పూడ్చేందుకు మట్టి కుప్పలు వేసి గుంతలు పూడ్చడం మర్చిపోవడంతో ఎలా ఉన్న గుంతలు అలాగే ఉన్నాయని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. జుక్కల్ బస్టాండ్ ప్రాంతంలో గత కొన్ని ఏళ్లుగా బస్సుల రద్దీకి, వర్షం దాటికి బురద ఏర్పడి గుంతలు పడ్డాయి. బస్సు బయటకు రావాలంటే గుంత మార్గంతో ఇబ్బందులు ఎదురవడంతో అధికారులకు వినతులు రావడంతో మొరం పోయించారు. కానీ చదును చేపించకపోవడంతో ఎక్కడి కుప్పలు అక్కడే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టికుప్పలతో గుంతలను పూడ్చి చదును చేయించాలని ప్రయాణికులు, మండల వాసులు కోరుతున్నారు.



రికార్డులను ఆన్‌లైన్ చేయాలి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జుక్కల్ క్లస్టర్ పరిధిలో ఉన్న 26 అంగన్వాడి టీచర్లు జుక్కల్ మండల కేంద్రంలో ఐసిడిఎస్ జుక్కల్ సూపర్వైజర్ వినోదా ఆధ్వర్యంలో క్లస్టర్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ వినోదా మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని టీచర్లు ప్రతి ఒక్కరు ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ సరఫరా చేస్తున్న బాలామృతం పంపిణీ , పౌష్టికాహారం , పిల్లల హెల్త్ ప్రొఫైల్ ఇతర విషయాలు కచ్చితంగా ఐసిడిఎస్ కు సంబంధించిన రెండు యాప్ లలోఆన్‌లైన్‌లో నమోదు ఎప్పటికప్పుడు చేయాలని ఏమైనా అనుమానాలు ఉంటే తనను సంప్రదించాలని తెలిపారు. మ్యానువల్ రికార్డులో ఏ విధంగా ఉంటుందో ఆన్‌లైన్‌లో కూడా అదే విధంగా నమోదు చేయాలని సూచించారు. ఆన్లైన్ చేస్తున్నప్పుడు జాగ్రత్తగా వహిస్తూ తప్పులు జరగకుండా చేయాలని సమావేశంలో సూచించారు.

సామాజిక సేవలో ఆనందం

- కత్తల్‌వాడి ప్రధానోపాధ్యాయురాలు వాగ్మారె జ్యోతిశంకర్

నవతెలంగాణ-జుక్కల్

సామాజిక సేవ చేయడంలో ఆనందం కలుగుతుందని కత్తల్ వాడి ఎంపీపీఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు వాగ్మారె జ్యోతి శంకర్ తెలిపారు. తన తండ్రి జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు అవసరం నిమిత్తం వస్తువులు, రోగులకు పండ్లు , బ్రెడ్ పంపిణీ చేసినట్టు తెలిపారు. కుటుంబం ఉపాధ్యాయ వృత్తి నుండి రావడంతో తండ్రి వాగ్మా రే ప్రభాకర్ మరణానంతరం తండ్రి అడుగుజాడల్లో నడవాలని సూచనల మేరకు పేదలకు సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. తన తండ్రి వర్థంతి పురస్కరించుకొని కత్తల్‌వాడీ స్కూల్‌లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు, పక్క గ్రామమైన కత్తల్ వాడి ఎంపిపి ఎస్ విద్యార్థిని , విద్యార్థులకు పుస్తకాలు నోట్ బుక్కులు , పెన్నులు , పలక , బ్యాగుల తో పాటు ఎండాకాలం సమీపిస్తున్న సందర్భంగా విద్యార్థులకు దాహం తీర్చేందుకు ప్రతి విద్యార్థికి నాణ్యమైన వాటర్ బాటిలను పంపిణీ చేశారు. అదే విధంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆమె చేస్తున్న సామాజిక సేవలను గుర్తిస్తూ ఇరుగ్రామాల పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజ్జల్ వాడి ప్రధానోపాధ్యాయుడు రవీందర్ , మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రుచికరమైన భోజనం అందించాలి

- కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయురాలు శ్రీలత

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని రాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్లర్గి ప్రాథమిక పాఠశాలను సందర్శిం చారు. మధ్యాహ్న భోజనంలో తాజా ఆకుకూరగాయలు, సాంబార్‌తో కూడిన రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. వంట గదులను, వంట పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రత ఉండేలా చూడాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి సూచించారు. విద్యార్థులకు ఎఫ్ఏ పరీక్షలను నిర్వహించి మార్కు లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో నమోదు చేస్తున్న అపార్ ఐడి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాస్ , విట్టల్ , నవీన్ , క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపాల్ సింగ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు

ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ-దోమకొండ

మాచారెడ్డి మండలంలోని పరిదిపేట్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిధిపేటు గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పన్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఆలయ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

బ్రహ్మాజీ వాడి గ్రామ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ఏగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు శుక్రవారం తెలిపారు. అధ్యక్షులుగా కర్రోల్ల ఆశయ్య ఉపాధ్యక్షులుగా చిన్న గొల్ల సాయిలు, కర్రోళ్ల ఎల్లయ్య కార్యదర్శిగా శెట్టిపల్లి శ్రీకాంత్, గాజ పాపయ్య, కోశాధి కారిగా పెద్ద గొల్ల గంగరాజు సలహాదారులుగా మోతే ఎల్లయ్య, సెట్టిపల్లి చిన్న సాయిలు, చిన్న గొల్ల బాలరాజ్, ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టాలని ఇండ్ల లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కన్నాపూర్ తండాలో ఇందిరమ్మ ఇండ్లపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 400 నుండి 500 స్క్వేర్ ఫీట్ వైశాల్యంలో ఇండ్లను నిర్మించుకోవాలని, మంజూరైన లబ్ధిదారులు మాత్రమే ఇండ్లు నిర్మించుకో వాలని, అర్హులై దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మంజూరైన తర్వాత నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి, డిఈ సుభాష్, ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి గ్రామస్తులు గోవింద నాయక్, శర్మ నాయక్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-నిజాంసాగర్

రాష్ట్రస్థాయిలో ఈనెల 20వ తేదీన వికారాబాద్‌లో జరుగుతున్నటువంటి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలకు మండలంలోని జడ్పిహెచ్ఎస్ మల్లూరు పాఠశాల విద్యార్థి పి.శరుణ్ కుమార్ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే విధంగా ట్రైనింగ్ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఉపాధ్యాయుడు రాజుకు, విద్యార్థి శరుణ్ కుమార్ కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

28వ సారి రక్తదానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న శిల్ప (24) కి బి పాజిటివ్ రక్తం అవసరం కావాలని వారి కుటుంబ సభ్యులు సంప్రదించడంతో వారికి కావలసిన రక్తాన్ని కామారెడ్డి రక్తదాతన సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ 28 వ సారి ప్రభుత్వ వైద్యశాల లోని రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు సంఘాల ముసుగులో పాఠశాలలకు వెళ్లకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ప్రైవేటు కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ సమాజంలో చెడ్డ పేరు తీసుకువస్తుంటే, జమీల్ హైమద్ మాత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉండి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడమే కాకుండా, తలసేమియా చిన్నారులకు మెగా రక్తదాన శిబిరాలను విజయవంతం చేస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకొని ఉపాధ్యాయ లోకానికే ఆదర్శంగా నిలిచాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు సాదిక్ అలీ, సంతోష్, టెక్నీషియన్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సత్తయ్య (37) బుధవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. గ్రామంలో చుట్టుపక్కల వెతకగా కొత్త కుంట చెరువు వద్ద శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

- కెరియర్ గైడ్‌లైన్స్‌పై అవగాహన

నవతెలంగాణ-బిచ్కుంద


బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (అటానమస్) తృతీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఎంచుకునే అంశంపై కళాశాల ఐ క్యు ఏ సి ప్లేస్మెంట్ విభాగం వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ కెరియర్ గైడెన్స్ వక్త శ్రీనివాస్ రెడ్డి చే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను పెంచుకునే విధంగా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బాబు, ప్లేస్మెంట్ సెల్ డా.అశోక్ రావు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

24న వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జయప్రదం చేయండి

- వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు

నవతెలంగాణ-భిక్కనూర్

ఈనెల 24 కామారెడ్డి జిల్లా కేంద్రం లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు సహాయ కార్యదర్శి పద్మ వస్తున్నారని జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు, జిల్లాలో ఉన్న సంఘం మిత్రులందరు హాజరుకావాలని వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జంగంపల్లి గ్రామంలో పేద ప్రజలు పోరాడి సాధించుకున్న భూ పోరాట కేంద్రాన్ని సందర్శిస్తారని ప్రధానంగా గ్రామంలో పోరాటంలో పాల్గొన్న వాళ్లు అందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, నర్సవ్వ, బాలయ్య, బాలమణి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు

నీటి సమస్యలు రానీయొద్దు

నవతెలంగాణ-జుక్కల్/పెద్దకొడప్‌గల్/భిక్కనూర్

వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని గ్రామాలలో పల్లె అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. పడంపల్లిలో ఉద్యానవనం, క్రీడా మైదానం, కంపోస్ట్ షెడ్డు , పల్లె ప్రకృతి వనం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామ కార్యదర్శి గంగాధ ర్ ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యకాంత్ తో కలిసి పరిశీలించి పురోగతిపై ఆరా తీశారు. నాటిన మొక్కలను నిత్యం నీరు పెట్టాలని చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఉపాధిహామీ ఎఫ్ఏలకు ఆదేశించారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా చదివింది చేపట్టాలని సమస్యలు ప్రజలకు ఇబ్బంది పడకుండా జాగ్రతగ్తా ఉండాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దకొడప్‌గల్: వేసవికాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నీటినిల్వలు తగ్గిపోతుంటాయని, కావున తాగు, సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. నిరంతరం బోరు మోటర్లను నడిపించినట్లయితే నీటి సమస్యలు తలెత్తుత్తాయని కావున బోర్ మోటార్లను తక్కువ సమయం మాత్రమే నడపాలని సూచించారు.

భిక్కనూర్: మండలంలోని అంతంపల్లి గ్రామంలో నర్సరీలోని మొక్కలను ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి భార్గవికి సూచించారు. కంపోషెడ్, వాటర్ ట్యాంకులు పరిశీలించి వేసవికాలంలో గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ప్రచారం

- కాంగ్రెస్ అభ్యర్థి తరపున నాయకుల ప్రచారం

నవతెలంగాణ-నసురుల్లాబాద్/గాంధారి/లింగంపేట్/తాడ్వాయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున తమ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధిలో దూసుకుపోవచ్చని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ ప్రతినిధులు పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కంది మల్లేష్, యూసుఫ్, సాయిలు, ఖలీల్, ఫయాజ్, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు ఉన్నారు.

బాన్సువాడ (నసురుల్లాబాద్): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ శుక్రవారం పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికే రమేష్, జంగం రాజు పాల్గొన్నారు.

గాంధారి: గాంధారి మండలం జువ్వాడి గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వుట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బాబా, మండల యూత్ అధ్యక్షులు గణేష్, ఉపాధ్యక్షులు వినయ్, గ్రామ అధ్యక్షులు భూమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్, ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షులు మోహన్, భాను, సంజిత్, ఉమేర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీపూర్, మల్కపూర్ గ్రామాలలో శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్ల గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ వూట్కూరి నరేందర్ రెడ్డి మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి అత్యంత భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సామెల్, ఎల్లారెడ్డి సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్ రెడ్డి, అల్మాజీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దత్తు, బిక్కనూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోనె శ్రీకాంత్, వెల్లుట్ల సంతోష్ కుమార్ తదితరలున్నారు.

తాడ్వాయి: పట్టభద్రులకు అండగా ఉండే కాంగ్రెస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం కృష్ణాజివాడి, బ్రహ్మాజీ వాడి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రాజీవ్, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం లింగంపేట్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలబడుతున్నటువంటి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని లింగంపేట్ పట్టణంలో లో పట్టపద్రులను ఉపాధ్యాయులను వారి ఇండ్ల వద్దకు వెళ్లి ఓటు వేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, లింగంపేట్ టౌన్ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, మండల యూత్ అధ్యక్షులు రాజు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు వంజరి ఎల్లమయ్య, కౌడరవి, కాసిం సీనియర్ నాయకులు రఫీ యుద్దీన్. శివలాల్ తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్: ప్రచారంలో పాల్గొన్న నాయకులు



గాంధారిలో..

కాళేశ్వరం కాలువకు స్థల విచారణ

నవతెలంగాణ-తాడ్వాయి

కాళే శ్వరం కాలువకు స్థలం కొనుగోలు కోసం శుక్రవా రం గ్రామ స్తులతో అదనపు కలెక్టర్ విచారణ చేపట్టారు. కాల్వ అవసర నిమిత్తం ఎకరం పైగా అవసరం ఉన్నదని ఎకరం 10 గుంటలకు గాను 9.06 లక్షలకు కొనుగోలు చేస్తామని గ్రామస్తులతో విచారణ చేపట్టారు. త్వరలో మరమతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రహీముద్దీన్, ఇరిగేషన్ డి ఈ, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హారిక, సర్వేయర్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత నిరంతర ప్రక్రియ అని, ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దోమకొండ మండల కేంద్రం తో పాటు, సంగమేశ్వర్ గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్డు, ఇందిరమ్మ నమూనా ఇల్లు, పోలింగ్ కేంద్రం శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని నర్సరీలతో పాటు రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను సంరక్షించాలని తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగకుండా చూడాలని, గ్రామంలో ప్రజలకు రాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో ఇంటి పన్ను 100 శాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ఇందిరమ్మ నమూనా ఇంటిని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వాటర్ డే సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ,నాటిన మొక్కలకు నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ శ్రీనివాస్ ,ఎంపీడీవో ప్రవీణ్ కుమారు, తాహసిల్దార్ సంజయ్ రావు, ఏపిఎం రాజు, టెక్నికల్ అసిస్టెంట్ లింగం, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న అదనపు కలెక్టర్

తల్లీకొడుకుల ఆచూకీ లభ్యం


తప్పిపోయిన వారిని కుటుంబానికి అప్పగింత

నవతెలంగాణ-పోతంగల్ (కోటగిరి)

కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన తల్లీకొడుకులు ఇటీవల అదృశ్యమయ్యారు. కాగా వారి ఆచూకీ లభ్యమైందని ఎస్ఐ సందీప్ తెలిపారు. దివ్యాంగురాలైన జ్యోతి, తన ఏడాదిన్నర కుమారుడితో కలిసి కొద్దిరోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు కోటగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఆమె కరీంనగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను తీసుకువచ్చి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించినందుకు కుటుంసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసులను ఏసీపీ అభినందించారు.

పాఠశాలలో వంటగది పరిశీలన


వంటగదిని పరిశీలిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కట్టా అంజనేయులు శుక్రవారం వంటగదిని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని భోజన ఏజెన్సీ కార్మికులకు ఆదేశించారు. వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు సమయానుకూలంగా భోజనాన్ని అందించడమే కాకుండా ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్య బోధన చేయాలని ఆయన అన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అందరికీ అవగాహన అవసరం

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల వల్ల ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, ఎంతోమంది విద్యార్థులు, యువతీ యువకులు తమ జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని.. అలాంటి స్థితి నుంచి వీలైనంత తొందరగా సమాజాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉంటుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ అన్నారు. అందుకోసం మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల మీద అవగాహన విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. కొంతమంది తమ సంపాదన కోసం ఇతర అనైతిక వ్యవహారాల కోసం అమాయకులైన ఎంతో మందికి మాదక ద్రవ్యాలను అలవాటు చేసి వాటికి బానిసలుగా మారుస్తున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని, అంతేకాకుండా మన చుట్టూ ఉన్న వారిలో ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసగా మారితే వారిని వెంటనే డి అడిక్షన్ సెంటర్లకు పంపిం చాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం ఎంతో విశేషంగా కృషి చేస్తున్నదని తెలిపారు. చిన్నపిల్లల దగ్గర నుంచి ముసలి వాళ్ళ వరకు అందరికీ ఏదో ఒక రూపంలో మదకద్రవ్యాలను అలవాటుగా మార్చే ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయని, వాటన్నింటి నుంచి సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంటుందని గుర్తు చేశారు. రెండు రోజుల ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ విశాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ నాగరాజు, మల్లేష్, ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్లు, సుధాకర్, వివిధ సెషన్లలో మాదకద్రవ్యాల నిర్మూలన మీద యువతి యువకులకు అవగాహన కల్పించారు. కామారెడ్డి నిజామాబాద్ జిల్లాల నుంచి ఎంపిక చేయబడిన 25 మంది యువతీ యువకులకు రెండు రోజులు పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. ఈ శిక్షణ పొందిన యువతీ యువకులు తమ తమ ప్రాంతాలలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అవగాహన కరపత్రాల పంపిణీ, ఇతర కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తారని వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది, యువజన సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో వనరుల కొరత లేకుండా చూడాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంధన వనరుల సాధ్యమైనంత ఎక్కువగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు శక్తివనరుల కొరత లేకుండా ఉండేట్లు చూడాలని తెలంగాణ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసన్ చంద్రశేఖర్ అన్నారు. పీఎం స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా జిహెచ్ఎస్ కోటగల్లి శంకర్ భవన్‌లో గురువారం తెలంగాణ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసన్ చంద్రశేఖర్ విద్యార్థులకు గ్రీన్ కెమిస్ట్రీ అండ్ ఎనర్జీ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై మార్గదర్శనం చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో విద్యార్థులు సాంప్రదాయ ఇంధన వనరుల పొదుపుగా వాడుకొంటూ సంప్రదాయేతర ఇంధన వనరుల సాధ్యమైనంత ఎక్కువగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు శక్తివనరుల కొరత లేకుండా ఉండేట్లు చూడాలని పిలుపునిచ్చారు. రాబోయే తరాలలో సౌరశక్తి, హైడ్రోజన్ శక్తి విరివిగా వాడటం జరుగుతుందని వాటి ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశం, ఉపాధ్యాయులు శైలేష్, సురేష్, గంగాకిషన్, రాములు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేసినా కాంగ్రెస్ ఖాతాలోకే

- స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్


మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేసినా కాంగ్రెస్ ఖాతాలోకే ఓట్లు వెళ్తాయని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే కార్పొరేట్ అభ్యర్థులు డబ్బుల కట్టలతో టికెట్ తెచ్చుకున్నవారే అని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేసినా కాంగ్రెస్ ఖాతలోకే పోతుందని హెచ్చరించారు. ఉద్యమకారుడిగా అరెస్టులు అదరకుండా బెదిరింపులకు బెదరకుండా ఇన్నేండ్లుగా ప్రజాక్షేత్రంలో అండగా నేనున్నానని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి ప్రసన్న హరికృష్ణను బీఆర్ఎస్ పార్టీలో చేరమని పంపించారని తనకు బీఫాం రాకుండా కుట్రలు చేసింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది తేజ్ దీప్‌రెడ్డి, కోమటిరెడ్డి, అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు గౌడ్, ఆమ్ ఆద్మీ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షులు అజహరుద్దీన్, జన్ ఉద్యం కాన్సుమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షులు ఫిరోజ్ ఖాన్, ఉద్యమకారుడు రాము యాదవ్ సూర తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యలను పరిష్కరించే నాయకుడు నరేందర్‌రెడ్డికే ఓటు వేయండి


- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంచనకోటి రాధాకిషన్‌గౌడ్



నవతెలంగాణ-నిజామాబాద్

ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి అమూల్యమైన ఓటువేసి గెలిపించాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంచనకోట రాధాకృష్ణన్ గౌడ్ తెలిపారు. ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పట్టభద్రులను కోరారు. బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సైతం ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీ రంగంలో ఉన్న నరేందర్‌రెడ్డికే, పట్టభద్రులు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సైతం కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఎన్నికల నిర్వహణకు టెక్నికల్ అఫీషియల్‌గా సాయిలు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రియ స్కూల్ పి.ఇ.టి సాయిలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు టెక్నికల్ అఫిషియల్ మెంబర్‌గా శుక్రవారం ఎన్నికయ్యారు. చేపూర్ క్షత్రియ స్కూల్‌లో పి.ఇ.టిగా సేవలు కొనసాగిస్తున్న బి.సాయిలు వికారాబాద్‌లో ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాలబాలికల కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు టెక్నికల్ అఫిషియల్‌గా ఎంపికవ్వడం పట్ల క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, క్షత్రియ యాజమాన్యం, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి హర్షం వ్యక్తం చేసి అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే పొలంబాట


పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్‌పిడిసిఎల్ టెక్నికల్ డీఈ అంజాపూర్ రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే తమ శాఖ అధికారులు, ఉద్యోగులతో పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు వాడటం వలన నాణ్యమైన విద్యుత్‌ను పొందగలుగుతారని వివరించారు. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవని అందరూ తప్పనిసరిగా కెపాసిటర్లు వాడాలని రైతులకు సూచించారు. రైతులు విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాల్సి ఉంటుందని స్టార్టర్ బాక్సుల దగ్గర ఎర్త్ వాడాలని ఫీజుల సమస్యలు ఏవైనా ఉంటే మీకు మీరుగా కాకుండా హెల్పర్స్, లైన్మెన్‌లను సంప్రదించాలని అన్నారు. నాసిరకం వైర్లను వాడవద్దని మంచి విద్యుత్ కోసం నాణ్యమైన కేబుల్స్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తుందని, భద్రతా చర్యల్లో నిర్లక్ష్యం, అవగాహన లోపంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రైతులతో అన్నారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకమైన పరికరాలు వాడడం, రైతులు వ్యవసాయం మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు(ఎర్తింగ్) పట్టించుకోకపోవడం వంటి కారణలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

వీటి నివారణకు చేపట్టిన కార్యక్రమమే ఈ పొలం బాట కార్యక్రమమని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుందని రైతులకు విన్నవించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిపోయిన స్తంభాలు ఉంటే రైతులు సంబంధిత అధికారులకు తెలియజే యాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే మీకు మీరుగా కాకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామ లేదా మండల విద్యుత్ శాఖ అధికారులు మీరు చెప్పి న సమస్యను పట్టించుకోకుండా పెడచెవిన పెడితే టోల్ ఫ్రీ నెంబర్ 1912 కాల్ చేసి రైతులు వారి సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపో వచ్చునని అన్నారు. ప్రతీ ఉద్యోగి విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రైతుల సమ క్షంలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ వినోద్, ఏఈ రూప్‌సాయి, లైన్మెన్ దేవయ్య, విద్యుత్ శాఖ బృందం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'యశోద'లో అరుదైన శస్త్రచికిత్స

- వివరాలు వెల్లడించిన వైద్యులు



మాట్లాడుతున్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. అసాధారణమైన ట్యూమర్‌తో తీవ్రంగా బాధపడుతున్న రోగికి శస్త్ర చికిత్స నిర్వహించి నమశక్యం కాని ఫలితాన్ని రాబట్టారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన ఫర్జానా బేగం (52) మహిళ తీవ్రమైన తలనొప్పి (పంటి భాగం, నుదురు, ముక్కు తదితర భాగాలు) ఇలా వచ్చినప్పుడల్లా అసహజ లక్షణాలతో యశోద హాస్పిటల్ సికింద్రాబాద్‌కు వచ్చింది. రమారమి నెలకు రెండుసార్లు తిమ్మిర్లు, చూపు మందగించడం, తెలియకుండా కిందపడిపోవడం జరిగేది. ఇంకా కొన్నిసార్లు ముఖాకృతి మారటం, ముక్కు, నాలుక, దవడ పరిమాణం పెరగడం, పళ్ళ అరమరికలో మార్పు, మింగటంలో ఇబ్బంది, ఇతరత్రా సమస్యలు, చేతులు, వేళ్ల వాపులు వంటి అనూహ్యమైన వ్యాధి లక్షణాలతో వచ్చింది. మేము ఆమెకు ఎంఆర్ఐ బ్రెయిన్ (ప్లెయిన్ అండ్ కాంట్రాస్ట్) చేయించి పెద్ద పిట్యుటరీ ట్యూమర్‌ను గుర్తించాం. ఈ ట్యూమర్లో ఉన్న గ్రోత్ హార్మోన్స్ సీక్రెషన్స్ వల్ల ఈ పైవ్యాధి లక్షణాలు కలిగాయి. నరానికి, నాడికి అతుక్కుని సంక్లిష్టంగా ఉన్న ఈ ట్యూమర్‌ను శస్త్ర చికిత్స సహాయంతో తొలగించాలని రోగి తరపు బంధువులకు వివరించాము. ముందుగా పేషంటు కొన్ని రకాల ఉపశమనం మందులతో వైద్యం ప్రారంభించాం. అవి కూడా ఇతర స్పెషలిస్టుల సహాయంతో (ఇ.యన్.టి. సర్జన్/ఎండోక్రైనాలజిస్ట్), పి.పి.ఐ., కార్టిజోన్స్, యాంటియమటిక్స్ ఇతరత్రా బి.పి. మందులు వాడాము. ఈ శస్త్ర చికిత్స ద్వారా ట్యూమర్‌ను ట్రాన్స్ ఎండోస్కోపిక్, ట్రాన్స్‌జల్ పద్ధతిలో దాదాపు పూర్తిగా తొలగించాం. శస్త్ర చికిత్స అనంతరం మరల సి.టి. బ్రెయిన్ చేశాం. అందులో పూర్వపు లక్షణాలు, రక్తస్రావం, వాపు లాంటివి కనబడలేదు. న్యూరో హెచ్.డి.యు.లో ఒక రోజు ఉంచి, జనరల్ వార్డుకు మార్చాం. సర్జరీ అనంతరం రోగిని స్థిరమైన స్థితిలో డిశార్జ్ చేశాం. తలనొప్పి, సర్జరీకి ముందు ఉన్న సమస్యల నుంచి దాదాపు ఉపశమనం లభించింది. ఈ శస్త్ర చికిత్సను డాక్టర్లు కె.యస్.కిరణ్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్, యశోద హాస్పిటల్, సికింద్రాబాద్ వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

చీకటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ చీకటి ప్రభుత్వానికి పట్టభద్రులు బుద్ధి చెప్పాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. శుక్రవారం ఖలీల్‌వాడిలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఓల్డ్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. గెలిచాక రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు గాలికి వదిలి రిటైర్డ్ బెనిఫిట్స్ కూడా సరిగా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతుంటే ఉద్యోగుల పక్షాన 317 జీవోకు వ్యతిరేకంగా బిజెపి ఉద్యమం చేపడితే అరెస్టులు, లాఠీఛార్జీలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 6వేల కోట్ల పైచిలుకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఏమైపోయాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇచ్చాకే పట్టభద్రులను ఓటు అడగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, సెక్రటరీ భోజగౌడ్, ట్రెజరర్ ఆశయ్య, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఎన్ఎస్‌యూఐ పనిచేయాలి

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వివేక్ స్వామి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఎన్ఎస్‌యూఐ పనిచేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వివేక్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్‌తో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ స్వామి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పలువురు ఎన్ఎస్‌యూఐ నాయకులను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నియోజకవర్గ, మండల స్థాయి కోఆర్డినేటర్లుగా నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, వరుణ్, నిఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై లబ్దిదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న మండల పంచాయతీ అధికారి రఫీ హైమద్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా, పేపర్‌మిల్లు గ్రామంలో శుక్రవారం హౌసింగ్ అధికారులు గంగాధర్, నివర్తి, మండల పంచాయతీ అధికారి రఫీ హైమద్ లబ్దిదారులకు అవగాహన కల్పించారు. పైలెట్ గ్రామంలో ఎంపిక చేసిన నీలా, పేపర్‌మిల్లు గ్రామంలో 124 మందికి ఇండ్లు మంజూరు కాగా విడతల వారీగా వారికి నిధులు అందజేయనున్నట్టు వారు పేర్కొన్నారు. లబ్దిదారులకు ముందస్తుగా అవగాహన కల్పించారు. మొదట తమ సొంత స్థలంలో ముగ్గువేసి క్రమంలో గ్రామ కార్యదర్శి సమాచారం అందించి ముగ్గు వేసిన ఫోటోలను ఆన్లైన్లో పంపిస్తే నిర్మాణానికి అనుమతి లభిస్తుందన్నారు. బేస్మెంట్ లెవల్‌లో మొదటి విడత లక్ష రూపాయలు, రూమ్ లెవెల్‌లో రెండవ విడతగా రూ.లక్ష 75 వేలు, స్లాబ్ లెవల్లో లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు, నిర్మాణం పూర్తయిన తర్వాత కలర్ వేసే సమయంలో లక్ష రూపా యలు కేటాయించనున్నట్లు హౌసింగ్ డీఈ గంగాధర్, ఏఈ నివర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జె.భాస్కర్, ఎస్‌కే నసీర్, రమేష్ సోన్కాంబ్లే, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి సింగిల్ విండో కార్యాలయం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ చైర్మన్ రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మార్క్‌ఫెడ్ మేనేజర్‌కు విన్నవించారు. కమ్మర్‌పల్లి సొసైటీ పరిధిలోని ఉప్లూర్, రాజరాజేశ్వరినగర్, నాగపూర్, కమ్మర్‌పల్లి గ్రామాలలో రైతులు సుమారు 2500 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చిందని, మొక్కజొన్న పంట మార్కెట్లో ఎమ్మెస్పీ ధర కంటే తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కమ్మర్‌పల్లి సింగిల్ విండో ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వినతిపత్రంలో తెలిపారు. తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా కమ్మర్‌పల్లి సొసైటీకి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంజూరు ఇవ్వాలని మార్క్‌ఫెడ్ మేనేజర్‌కు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సింగిల్ విండో కార్యదర్శి శంకర్ ద్వారా మార్క్‌ఫెడ్ మేనేజర్‌కు అందజేసినట్లు ఈ సందర్భంగా విండో చైర్మన్ రేగుంట దేవేందర్ తెలిపారు.

వరి పంటపై రైతు పొలం బడి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వారి వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ వారి కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు వరిలో సమగ్ర సస్య రక్షణపైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరెడ్డి రైతులకు వ్యవసాయంలో లింగకర్షక బుట్టల ఉపయోగం, విత్తన శుద్ధి ఉపయోగాలను వివరించారు. కేవీకె, రుద్రూర్ నుంచి వచ్చిన శాస్త్రవేత్త శ్రీ విజయ కుమార్ మాట్లాడుతూ.. జీవ నియంత్రణ ప్రాముఖ్యతతో పాటు వరిలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి విపులంగా చెప్పారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్ శంకర్ మిత్ర పురుగుల పరిచయం సస్య సంరక్షణలో దాని ప్రాముఖ్యత, పురుగుల వివిధ దశల గురించి వివరించారు. హెన్నప్పగౌడ, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విత్తన శుద్ధి, లింగాకర్షక బుట్టలను పెట్టే పద్ధతి డెమో చేయించి చూపించారు. స్థానిక మండల వ్యవసాయ అధికారిణి దేవిక, అగ్రికల్చర్ ఆఫీసర్ శివప్రసాద్ పురుగుమందుల కొనడంలో, వాడకంలో, వాడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రైతులకు వరి కాండం తొలుచు పురుగు నివారణ కోసం లింగకర్షక బుట్టలను పంపిణీ చేశారు.

60 ఏండ్ల మహాప్రస్థానం..

విద్యలో మహాశిఖరం

సెయింట్ ఈఏఎస్ హైస్కూల్‌లో నేడు వజ్రోత్సవ వేడుకలు

గ్రామీణ ప్రాంతాలలో వెలుగులు నింపేందుకు ఆ సంస్థ మహా సంకల్పంతో విద్యార్థులను చేరదీసి ఎంతోమందిని తీర్చిదిద్దింది. ఎంతలా అంటే రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న నాయకులుగా.. వివిధ రాష్ట్రాలలో పలు వ్యాపార రంగాల్లో ఉన్నత స్థానాలకు అధిరోహించేలా.. ప్రభుత్వ శాఖలలో అత్యున్నత హోదాల్లో.. ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడి ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచేలా.. ఇలా ఎంతోమంది విద్యార్థులకు ఓనమాలు నేర్పించి "ఇంతింతై..వటుడింతై" అనే చందంగా పాఠశాల ప్రారంభమై 60 సంవత్సరాలు గడిచినా ఎన్నో కష్టాలను, అడ్డంకులను ఎదుర్కొంటూ నేటికీ తన ప్రత్యేక గుర్తింపును చెక్కుచెదరకుండా కొనసాగిస్తోంది. నేడు వజ్రోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్న సెయింట్ ఈఏఎస్ హైస్కూల్‌పై ప్రత్యేక కథనం.

నవతెలంగాణ-బాల్కొండ

పాఠశాలకు పునాది..

ఈ సంస్థ 60 సంవత్సరాల క్రితం ఇక్కడి ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిర్మిస్తామంటే ఎవరు సహకరించలేదు. సాహసించలేదు. కానీ కిసాన్‌నగర్ గ్రామ స్థాపకులు వెంకటకృష్ణారెడ్డి (వికే రెడ్డి) ఈ పాఠశాల స్థాపనకు వెన్నుముకగా ఉంటూ తన ప్రత్యేక సహకారం, ప్రోత్సాహంతో సెయింట్ ఎలిజబెత్ ఎన్ సెటోన్ స్కూల్ (సెయింట్ ఈఏఎస్) 1964-65 విద్యా సంవత్సరంలో కేవలం 14 మంది విద్యార్థులతో మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియంగా ఈ ప్రాంతంలో ఈ సంస్థ అప్పటి మేనేజ్మెంట్ పాఠశాలను ప్రారంభించింది.

సమాజంలోని మార్పులకు అనుగుణంగా..

1964 నుంచి నేటి వరకు సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యా విధానంలో విద్యార్థుల కోసం వారి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం ఇక్కడికి ఉపాధ్యాయులు వారి బోధనలలో ఎల్లప్పుడూ నైతిక విలువలతో విద్యార్థులను విద్యావేత్తలుగా



సెయింట్ ఈఏఎస్ హైస్కూల్‌లో

పెంపొందించడానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నాలు విద్యార్థిని విద్యార్థుల జీవితాల్లో గొప్ప స్థానాల్లో నిలబెట్టడంలో ఇక్కడి ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని చెప్పుకోవచ్చు.

క్రమశిక్షణకు మారుపేరుగా..

ఈ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడంలో నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు విద్యను అభ్యసించడానికి ఈ పాఠశాలకు వచ్చేవారు. ఈ పాఠశాలలో క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఐఏఎస్, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, పోలీస్, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, రాజకీయరంగంలో కీలక పదవులలో ఇలా వివిధ రంగాలలో వారు రాణిస్తున్నారు.

ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు పూర్వ విద్యార్థులు..

మోజీరాం : సెక్రటేరియట్‌లో ఫైనాన్స్ డిపార్ట్మెంట్ బోర్డ్ డైరెక్టర్
కె.హరిత : ఐఏఎస్ సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రెటరీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్
నర్సారెడ్డి : సిఐడి డిపార్ట్మెంట్
ఈరవత్రి అనిల్ : టీజీఎండీసీ చైర్మన్
ముత్యాల సునీల్ కుమార్ : ఆరెంజ్ ట్రావెల్స్ సంస్థ అధినేత

గురువులను ఎప్పటికీ మరువలేం



నేడు నేను చదువుకున్న పాఠశాల వజ్రోత్సవాలు జరుపుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ పాఠశాల ఉపాధ్యాయులు చిన్న నాడు మా హృదయాలలో క్రమశిక్షణ, జ్ఞానమనే బీజాలను నాటడం వలన నేడు మహా వృక్షాలయ్యాయి. నేనే కాకుండా ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు సమాజంలో మంచి పేరు.. ప్రఖ్యాతలు రావడానికి ఈ పాఠశాల గురువులే కారకులు. ఈ బడిని.. మాకు బోధించిన గురువులను ఎప్పటికీ మరువలేము. **- ఈరవత్రి అనిల్, పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్యే, టీజీఎండిసి చైర్మన్**

నాణ్యమైన విద్యనందిస్తాం



సంస్థలో 30 సంవత్సరాలు సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నాను. ప్రస్తుతం ఈ పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. హెచ్ఎంగా అవకాశాన్ని ఇచ్చినందుకు మా సంస్థకు రుణపడి ఉంటాను. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని మరింత మెరుగుపరచడానికి దృఢ సంకల్పంతో కృషి చేస్తాను. నా హయాంలో ఈ పాఠశాల వజ్రోత్సవాలు జరుపుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
- సిస్టర్ సుందరి, హెచ్ఎం సెయింట్ ఈఏఎస్ స్కూల్

పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్, వార్డు నెంబర్ 12, రామారెడ్డి బై పాస్ ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి మున్సిపల్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి చెత్త సేకరణ ప్రతీరోజూ నిర్వహిస్తే వీధుల్లో గృహిణులు చెత్త వేయరని, ప్రతీరోజూ ప్రతీ ఇంటి నుండి తడి పొడి చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది సేకరించాలని అన్నారు. రోడ్లపై వేయకుండా చెత్త బుట్టలో వేసే విధంగా అవగాహన కల్పించాలని, ప్రచారం నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ ఆధీనంలోని ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఆయా వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటింటి నుండి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, సెగ్రిగేషన్ చేయాలన్నారు. దుకాణ సముదాయల్లోని చెత్తను ప్రతీరోజూ సేకరించాలని, రోడ్డు పై చెత్త వేసే వారికి మొదట అవగాహన కల్పించాలని, ఆ తదుపరి కూడా చెత్తను రోడ్లపై వేస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న నాలీల్లోని చెత్తను తొలగించాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని, నాలీల్లో చెత్త వేయకుండా ప్రజలకు తెలియపరచాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈఈ శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్, తదితరులున్నారు.

అఖండ హరినామ సప్తాహ

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గ బీసీ కాలనీలోని హనుమాన్ మందిరం వద్ద మహా శివరాత్రి శుభ సందర్భంగా అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని శుక్రవారం భక్త, భజన మండలితో ప్రారంభించారు. శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమం 28తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమానికి బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ రావడాన్ని అందరూ స్వాగతించారు.

అప్పులు చేసి పంచాయతీ పాలన

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

గ్రామపంచాయతీ నిధులు విడుదల చేసి పంచాయతీ కార్యదర్శులను ఆదుకోవాలని శుక్రవారం రాజంపేట్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో రాజేషం, ఎంపీవో రఘురామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ అప్పులు చేసి పంచాయతీ పాలన కొనసాగిస్తున్నామని సర్పంచుల పదవీకాలం ముగిసి సంవత్సరం గడిచిన నాటినుండి నేటి వరకు పంచాయతీ పాలన కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని నిధులు లేక పంచాయతీల పాలన కష్టమవుతుందన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించడంలో అప్పులు చేసి మరి సమస్యలు పరిష్కరించాల్సి వస్తుందని కార్యదర్శుల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకొని పెండింగ్ బిల్లులను, జీపీ నిధులను విడుదల చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- **ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కొన్ని నిమిషాల్లోనే ఇంటికి చేరుకునేవారు. అంతలోనే విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదం చోటుచేసుకోవడంతో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం వేకువజామున 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. డిచ్‌పల్లి ఎస్‌హెచ్ఓ మోహమ్మద్ షరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్ రజా (25), మహమ్మద్ షహీద్, మొయినోద్దీన్ ఖాన్, సయ్యద్ అయూబ్ అలీ నలుగురు కలిసి కారులో గురువారం ఉదయం హైదరాబాద్‌కు పని మీద వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ కమాన్ వద్ద 44వ జాతీయ రహదారిపై వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో వారి కారును వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా నిజామా బాద్ నగరంలోని ముజాహిద్‌నగర్‌కు చెందిన అబ్దుల్లా రహమాన్ మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన సయ్యద్ అయూబ్ అలీని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌కు, మొయినొద్దీనాన్, మహమ్మద్ షహీద్‌ను నిజామాబాద్‌లోని మనోరమ హాస్పిటల్‌కు తరలించారు ప్రస్తుతం కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుని తండ్రి షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



బోల్తాపడిన కారు

ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడి
- బ్యాలెట్ బాక్సుల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిజామాబాద్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు సమీకృత జిల్లా సముదాయాల కార్యాలయం వీ.సీ హాల్ నుంచి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు.



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులతో మాట్లాడుతూ.. ఈ.సీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవాలని అన్నారు. షామియానాలు, తాగునీరు, వీల్‌చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యల గురించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్‌ను పీ.ఓ, ఏ.పీ.ఓలు తమ వెంట కరీంనగర్ రిసెప్షన్ సెంటర్‌కు చేర్చాల్సి ఉంటుందని, వారితో పాటు సూక్ష్మ పరిశీలకులు కూడా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఓటింగ్ పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేవిధంగా జాగరూకతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ జరపాలని, ఆయా పోలింగ్ కేంద్రాలలో కొనసాగే ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ ముగిసిన మీదట సాధ్యమైనంత త్వరగా బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు చేర్చేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అదనపు డీసీపీ కె.రామచంద్రారావు, ఏ.సీ.పీ రాజవెంకటరెడ్డి, డీటీడబ్ల్యూఓ నాగూరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

తెలుగభాషను మరువొద్దు

- **ఘనంగా మాతృభాషా దినోత్సవం**

నవతెలంగాణ-విలేకరుల బృందం

సిర్పూర్ ఉన్నత పాఠశాలలో..

మోపాల్ : మండలంలోని సిర్పూర్ ప్రభుత్వ పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. మాతృభాషలో ఆలోచించే వ్యక్తి తన అభిప్రాయాలను స్పష్టంగా సూటిగా సమర్థవంతంగా వ్యక్తం చేయగలుగుతాడని తెలిపారు. బాధను, దుఃఖాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని దేనినైనా చక్కగా చెప్పాలంటే మాతృభాష అవసరమని అన్నారు. విద్యార్థులందరూ ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నప్పటికీ తెలుగు భాషను మర్చిపోవద్దని, తెలుగులో ఉండే మాధుర్యాన్ని, సొగసును అందుకోవాలని కోరారు. ఈ సభలో తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల మాట్లాడుతూ.. తెలుగు భాష అంటే కేవలం క్రియలతో అంతమయ్యే భాష మాత్రమే కాదని సామెతలు, పొడుపు కథలు, నుడికారాలు, పలుకుబడులు, జాతీయాలు వీటన్నింటిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ మాట్లాడే భాష తెలుగు అని, వీటన్నింటిమీద పట్టును సాధించి తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులందరూ గ్రహించాలని కోరారు. ఈ సందర్భంగా 100 కథాకార్డులను డాక్టర్ కాసర్ల తన సొంత ఖర్చులతో తయారు చేయించి సిర్పూర్ పాఠశాల గ్రంథాలయానికి బహుమతిగా అందించారు. ఆ తర్వాత విద్యార్థులకు జాతీయాలు, పొడుపు కథలు, సామెతలు, తెలుగు పద్యాలు మొదలగు వాటిలో పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, అక్బర్‌బాషా, వందన, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత విద్యార్థులు పాల్గొన్నారు



మోపాల్ : సిర్పూర్‌లో మాతృభాషా దినోత్సవ వేడుకలు

ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్‌లో..

ఏర్గట్ల : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవి పద్య విశారదగా గుర్తింపు పొందిన తల్లా వజ్జుల మహేష్ బాబు రాసిన "తెలుగు వాణి"శతకాన్ని నలుగురు విద్యార్థులు పద్యాధారణ చేశారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు మాతృభాష గొప్పతనాన్ని తెలిపే కథలు, నాటికలు, కవితలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

బాల్కొండ : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిట్టాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠన పోటీలు, తెలుగువాణి శతక ధారణ సభ నిర్వహించారు. ప్రముఖ కవి, అష్టావధాని డాక్టర్ గణపతి అశోక శర్మ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు తల్లా వజల మహేష్ బాబు రచించిన తెలుగు వాణి శతకములోని 108 నీతి పద్యాలను వరుస క్రమం తప్పకుండా, చూడకుండా కంఠత పద్యాలను చాందిని, వినీత, భవిష్య, లాస్య శ్రీ, శరత్ చంద్ర ఆలపించారు. అనంతరం జరిగిన పద్యపఠన పోటీలలో పాడిన పద్యం పాడకుండా 22 మంది విద్యార్థులు 42 ఆవృతాలలో 315 పద్యాలు కంఠత అప్పజెప్పారు. ఈ పోటీలో ఉన్నత స్థాయిలో చాందిని, శరత్ చంద్ర, లాస్య శ్రీ, ప్రాథమికోన్నత స్థాయిలో శ్రీనిధి, సుష్మ శ్రీ, వైద్రితి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. భావన, చరణ శ్రీ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అనంతరం డాక్టర్ గణపతి అశోక శర్మ పద్య, శ్లోక పఠనముతో ఆశువుగా పద్యాలు చెబుతూ మాతృభాషా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుదర్శన్, నర్సారెడ్డి, భృగు మహర్షి, రామారెడ్డి, శ్రీనివాస్, పద్మ, తెలుగు భాషోపాధ్యాయులు రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.



ఏర్గట్ల జెడ్పీహెచ్ఎస్‌లో..

ఆపద సమయంలో ఎల్‌వోసీ అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల కేంద్రానికి చెందిన పి.ప్రేమల తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హైదరబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించగా వైద్య ఖర్చుల కొరకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,25,000 ఎల్‌వోసీని అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

గిరిరాజ్ కాలేజీ యూజీ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల డిసెంబర్ 2024, జనవరి 2025 లో నిర్వహించిన బి.ఎ., బి.కాం., బి.బి.ఎ., బి.సి. ఎ., బి. యస్సీ. 1వ , 3వ , 5వ సెమిస్టర్ల రెగ్యులర్ (2024-25) పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. https://gdets.cgg.gov.in/nizamabad.edu లో తెలుసు కోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాంమోహన్ రెడ్డి తెలిపారు.